
సాక్షి
మహబూబాబాద్
శుక్రవారం । 27 । జనవరి । 2023



అసౌకర్యం కలగకుండా...

మేడారం మినీ జాతరలో భక్తులకు అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నట్లు ములుగు డీపీఓ వెంకయ్య తెలిపారు. - 8లో▶



కేసీఆర్ సేవలు దేశానికి అవసరం

ముఖ్యమంత్రి కేసీఆర్ సేవలు దేశానికి అవసరమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▶

గరిష్ఠం/కనిష్ఠం
33.1°/13.5°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మంచుతో పాటు చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ డీఎం'

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జె.విజయ్ గురువారం తెలిపారు. డిపో అభివృద్ధికి సలహాలు, సూచనలు చేసేవారు సాయంత్రం 4నుంచి 5 గంటల వరకు 9959226054 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. ఆర్టీసీని ఆదరించాలని, డిపో అభివృద్ధికి ప్రజలు, ప్రయాణికులు సహకరించాలని కోరారు.

వెండి మకరతోరణం బహూకరణ



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ ఆలయంలో అమ్మవారికి ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన తల్లాడ వెంకటేశ్వరరావు–ధనలక్ష్మి, తల్లాడ విజయ్‌కుమార్–మౌనిక దంపతులు వెండి మకర తోరణాన్ని బహూకరించినట్లు ఆలయ ఈఓ సత్యనారాయణ, చైర్మన్ బాదావత్ రామునాయక్ తెలిపారు. గురువారం భక్తులు రెండు కేజీల 770 గ్రాముల మిశ్రమ వెండితో తయారు చేసిన మకర తోరణాన్ని తీసుకొచ్చి అమ్మవారికి అలంకరించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వీరభద్రస్వామి వారిని దర్శించుకున్నారు. వారిని అర్చకులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జడ్జి ప్రత్యేక పూజలు



నర్సింహులపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం తొర్రూరు కోర్టు ఇన్‌చార్జ్ సివిల్ జడ్జి తిరుపతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది జడ్జికి ఘన స్వాగతం పలికారు. పూజారులు వేదమంత్రాలతో పూజలు నిర్వహించిన అనంతరం జడ్జిని పట్టు వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రమేష్, సిబ్బంది శేఖర్, పూజారులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి



బయ్యారం: ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని డీఏఓ ఛత్రునాయక్ వ్యవసాయ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని కోయగూడెంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసిన 20 మంది రైతుల పంటల వివరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రవళిక, జి.సురేష్ పాల్గొన్నారు.

జాతీయ జెండాకు అవమానం



మహబూబాబాద్ రూరల్: మానుకోట మండలంలోని ఇస్లావత్‌తండా జీపీ పరిధి తేజావత్ తండా అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీఎస్ ఆవరణలో గురువారం ఎగురవేసిన జాతీయ జెండాకు అవమానం జరిగింది. ఉదయం ఎగురవేసిన జెండా సాయంత్రం వరకు కూడా అవనతం చేయలేదు. ఈ క్రమంలో ఏం జరిగిందో ఏమోకానీ జాతీయ జెండా కిందపడిపోయింది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

నగదు పురస్కారం అందజేత

మహబూబాబాద్ రూరల్: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన గణిత పోటీల్లో తృతీయ స్థానం సాధించిన మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇందుర్తి సాయిలేఖ్యకు గురువారం రూ.2వేల నగదు బహుమతి అందజేసి అభినందించారు. స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, సంస్థ బాధ్యులు మేకల కృష్ణయ్య ఆధ్వర్యంలో సర్పంచ్ సంద ఈరన్న చేతుల మీదుగా విద్యార్థిని సాయిలేఖ్య, గైడ్‌టీచర్లు గురునాథరావు, సతీష్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమేష్‌బాబు, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్, వెంకట్రామనర్సయ్య, ఉపసర్పంచ్ చీరిక వేణురెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ పోతుగంటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా అభివృద్ధి

- జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం
- ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ముందుకు..
- అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ శశాంక



భరతమాత వేషధారణలో విద్యార్థిని



గ్యాలరీలో ఆశీనులై సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, అతిథులు



జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

సాక్షి, మహబూబాబాద్: మానుకోట జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ శశాంక అన్నారు. 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్య్ర సమరయోధులు, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే శంకర్ నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ బిందుతో కలిసి కలెక్టర్ సన్మానించారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందజేసి సత్కరించారు. దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన మానుకోట జిల్లాను ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని అన్నారు. అనంతరం జిల్లా ప్రగతి నివేదికను కలెక్టర్ విడుదల చేశారు.

మెరుగైన వసతులు.. బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి.. నాణ్యమైన బోధన అందిస్తున్నామని కలెక్టర్ అన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొదటి విడతగా 316పాఠశాలలను ఎంపిక చేశామని, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్‌తోపాటు పాఠశాలలకు పెయింటింగ్ వేయించి సుందరంగా తీర్చిద్దుతున్నామని కలెక్టర్ నివేదికలో పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లాలోని 1,927మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి తొలిమెట్టు కార్యక్రమం ద్వారా మెరుగైన బోధన జరిగేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు వసతులు కల్పించి మెరుగైన విద్య అందిస్తున్నామన్నారు. స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నామని, విదేశాల్లో సైతం చదువుకోవడానికి ప్రభుత్వం చేయూతనిస్తుందని తెలిపారు.

చేరువలో ప్రభుత్వ వైద్యం

జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఇందులో భాగంగా మహబూబాబాద్ పట్టణంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు, దీనికి అనుబంధంగా 330పడకల ఆస్పత్రి సేవలు అందుబాటులోకి తెచ్చామని నివేదికలో వివరించారు. అదేవిధంగా రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై శ్రద్ధపెట్టి మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం..

జిల్లాలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. యాసంగిలో 1,79,780మంది రైతులకు రూ.177.99 కోట్ల రైతుబంధు అందజేశామని తెలిపారు. అదేవిధంగా ఏడాదిలో 224మంది రైతులు మృతి చెందగా రైతుబీమా పథకం ద్వారా వారి కుటుంబసభ్యుల ఖాతాల్లో రూ.11.20కోట్లు జమచేసి ఆదుకున్నామని చెప్పారు. ఉద్యానశాఖ ద్వారా ఆయిల్‌పామ్ పంట సాగును ప్రోత్సహిస్తున్నామని, దీనిలో భాగంగా 3,437 ఎకరాల్లో పంట సాగుకు రైతులు ముందుకు వచ్చారని తెలిపారు. నీటిపారుదల అభివృద్ధి పథకం ద్వారా 16 మండలాలో 1,622 చెరువుల ద్వారా 1,05,055 ఎకరాల్లో సాగు జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. 8,183 ఎకరాల్లో సాగునీరు అందించేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేశామని అన్నారు. శ్రీరాంసాగర్ స్టేజీ–1ద్వారా వానాకాలంలో 1,18,174 ఎకరాలకు, యాసంగిలో 73,826 ఎకరాలకు, స్టేజీ–2 ద్వారా వానాకాలంలో 41,564 ఎకరాలు, యాసంగిలో 27,731ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని అన్నారు. భూగర్భ జలాల పెంపు, గిరివికాసం పథకం ద్వారా వివిధ కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. పశుసంవర్ధకశాఖ రైతులను ప్రోత్సహించడం, మత్స్యకారులకు ఉచితంగా చేపలు, రొయ్యలు పంపిణీ చేశామని అన్నారు. వానాకాలంలో 234 కొనుగోలు కేంద్రాల ద్వారా 2,17,881మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సంక్షేమ ఫలాలు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ అన్నారు. ఆహారభద్రతలో భాగంగా నెలలో 3,866మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం అందిస్తున్నామని నివేదికలో పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు, ఆసరా పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. పేదరిక నిర్మూలనలో భాగంగా దళితబంధు పథకాన్ని అమలు చేస్తున్నామని, జిల్లాలో 305మంది దళిత కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున అందజేశామన్నారు. 5,571డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టి ఇప్పటి వరకు 896ఇళ్లను లబ్ధిదారులకు అందజేశామని చెప్పారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించామని తెలిపారు. వీటితోపాటు 8,7846 బావులకు ఉచిత విద్యుత్ సరఫరా, పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా పల్లెలు, మున్సిపాలిటీలను సుందరంగా తీర్చిదిద్దుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. అటవీశాఖ ద్వారా 15లక్షల మొక్కలు నాటామని చెప్పారు. ప్రజలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో 21ఎకరాల్లో రూ.56.20కోట్లతో సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం నిర్మించుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్, ట్రైనీ కలెక్టర్ పింకేష్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందజేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఉత్తములకు 'ప్రశంస'లు - 8లో▶

కోర్టు ప్రాంగణంలో వేడుకలు



జెండాకు వందనం చేస్తున్న ఎస్పీ



సబ్ జైలులో జెండా ఎగురవేస్తున్న జైలర్



బహుమతి అందజేస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

మహబూబాబాద్ రూరల్: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మానుకోట పట్టణంలోని జిల్లా కోర్టు భవనాల సముదాయ ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ గురువారం జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సీనియర్‌సివిల్ జడ్జి సి.సురేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొద్దుటూరి రవికుమార్, ప్రధాన కార్యదర్శి సంద క్రిష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు. వివిధ క్రీడా పోటీలు నిర్వహించిన సందర్భంగా గెలుపొందిన వారికి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బహుమతులు అందజేశారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ జాతీయజెండాను ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీలు సదయ్య, రఘు, రమణబాబు, జనార్దన్‌రెడ్డి, ఆర్‌ఐలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని సబ్‌జైలులో జైలర్ మల్లెల శ్రీనివాసరావు జాతీయ జెండా ఎగురవేసి ఖైదీలతో మాట్లాడారు. ఖైదీలకు మిఠాయిలు పంపిణీ చేశారు.

రాజకీయ లబ్ధికోసమే మతాలమధ్య చిచ్చు



యాత్రను ప్రారంభిస్తున్న భరత్‌చంద్రారెడ్డి

గార్ల: బీజేపీ, టీఆర్‌ఎస్ పార్టీలు కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ రాజకీయ పబ్బం గడుపుతున్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డి ఆరోపించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు గురువారం గార్లలో హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను ఆయన పార్టీ జెండాను ఊపి ప్రారంభించి మాట్లాడారు. కుల, మత రాజకీయాలు దేశ, రాష్ట్రాల విచ్ఛిన్నానికి దారి తీస్తున్నాయన్నారు. నాడు కాంగ్రెస్ పాలకులు దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీన వర్గాలకు రక్షణ కల్పిస్తే, నేడు బీజేపీ, టీఆర్‌ఎస్ ప్రభుత్వాలు వారికి వ్యతిరేకంగా పాలన సాగిస్తున్నాయని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్ర ఉద్దేశాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో గడపగడపకు తీసుకెళ్లాలని కోరారు. మండలంలోని కొత్తతండాలో వివిధ పార్టీలకు చెందిన 25 కుటుంబాలు డీసీసీ అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ ఇల్లెందు నియోజకవర్గ నాయకులు చీమల వెంకటేశ్వర్లు, డాక్టర్ రవి, డాక్టర్ రామచంద్రునాయక్, నాగమణి, పార్టీ మండల అధ్యక్షుడు రామారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్, కొనకంచి రామకృష్ణ, శంషాద్‌బేగం, శ్రీనివాస్, శ్రీనివాస్, లచ్చిరాంనాయక్, గంగా, వినోద, రామారావు, వీరన్న, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కవిత విరాళం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎంపీ కవిత రూ.2,00,016 విరాళం గురువారం కమిటీకి అందజేశారు. మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, బొడ్రాయి కమిటీ బాధ్యులు వెంకన్న, శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వర్‌రావు, సుధాకర్, రమేష్, ఉప్పలయ్య, హరిప్రసాద్ పాల్గొన్నారు.

పదోన్నతులపై ఆశలు

- టీచర్ల బదిలీలు, పదోన్నతులపై కదలిక
- 1,102 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు
- పీజీటీ, భాషా పండితుల ప్రమోషన్లపై స్పష్టత కరువు

మహబూబాబాద్ అర్బన్: పదోన్నతుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల నిరీక్షణకు తెర పడనుంది. రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధమవ్వగా.. అర్హతగల ఉపాధ్యాయులు పదోన్నతులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా విద్యాశాఖలో పదోన్నతులు చేపట్టలేదు. 2018 సంవత్సరంలో బదిలీలు మాత్రమే కల్పించిన ప్రభుత్వం.. నాటి నుంచి నేటి వరకు పదోన్నతులు కల్పించలేదు. జిల్లాలో 3,113మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా ఇప్పటి వరకు 430 పోస్టులు ఖాళీగా ఉండగా.. పదోన్నతుల ద్వారా మరో 672పోస్టులు ఖాళీ అవుతాయి. ఇదిలా ఉండగా 317జీఓ ప్రకారం బదిలీ అయిన ఉపాధ్యాయులు, భాషా పండితులు, పీజీటీల పదోన్నతుల విషయంలో స్పష్టత లేకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నచోటనే పదవీ విరమణ..

జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో కొంతమంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు చేరిన పోస్టులో పదవీ విరమణ పొందుతున్నారు. ఎలాంటి పదోన్నతులు లేకపోవడంతో నిరుత్సాహంగా పదవీ విరమణ చేసిన వారు ఉన్నారు. అలాగే ఎస్‌జీటీ కేడర్‌లో 25సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న కొంతమదికి నేటికీ పదోన్నతులు లేవు. దీంతో వారు నిరాశలో ఉన్నారు.

ఖాళీలు 1,102పోస్టులు..

టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ముందుగా స్కూల్ అసిస్టెంట్లకు మల్టీజోనల్ ప్రాతిపదికన పీజీ హెచ్‌ఎంలుగా అవకాశాలు కల్పిస్తారు. సెకండరీ గ్రేడ్ టీచర్లకు (ఎస్‌జీటీ)లకు స్కూల్ అసిస్టెంట్లు పదోన్నతులు వస్తాయి. కాగా అన్ని కేటగిరిల్లో ఓకేచోట ఎనిమిది సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు 672మంది ఉన్నారు. వీరికి పదోన్నతులు వచ్చి ఖాళీలు ఏర్పడుతాయి. ఇప్పటికే జిల్లాలో 430 పోస్టులు ఖాళీ ఉన్నాయి. మొత్తంగా జిల్లాలో 1,102ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ కానున్నాయి.

ఖాళీల వివరాలు

కేటగిరి	8ఏళ్ల సర్వీస్	ఖాళీలు	మొత్తం
లాంగ్వేజ్ పండిట్ హిందీ	20	5	25
లాంగ్వేజ్‌పండిట్ తెలుగు	22	13	35
ప్రైమరీ హెచ్‌ఎం	2	67	69
పీఈటీ	10	2	12
ఎస్‌ఏ–సైన్స్ ఉర్దూ	-	1	1
ఎస్‌ఏ–సోషల్ ఉర్దూ	-	1	1
ఎస్‌ఏ–ఉర్దూ	-	1	1
ఎస్‌ఏ–బయో సైన్స్	10	50	60
ఎస్‌ఏ–ఇంగ్లిష్	13	22	35
ఎస్‌ఏ– హిందీ	4	8	12
ఎస్‌ఏ–గణితం	28	15	43
పీడీ	1	8	9
ఎస్‌ఏ– ఫిజికల్ సైన్స్	22	8	30
ఎస్‌ఏ– సోషల్	11	59	70
ఎస్‌ఏ–తెలుగు	4	16	20
ఎస్‌జీటీ ఉర్దూ	-	1	1
సెకండరీ గ్రేడ్ టీచర్స్	525	153	678
మొత్తం	672	430	1,102

ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం..



ఉపాధ్యాయ సంఘాల పోరాట ఫలితంగానే ప్రభుత్వం ఎట్టకేలకు దిగివచ్చి ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయడాన్ని టీఎస్‌యూటీఎఫ్ పక్షాన హర్షిస్తున్నాం. సీనియారిటీ జాబితాలో తప్పులకు చోటు ఇవ్వకుండా పారదర్శకంగా చేపట్టాలి. అదేవిధంగా భాషాపండిట్, పీజీటీలకు కూడా ఇదే షెడ్యూల్‌లో అవకాశం కల్పించాలి.

-ఏ.మురళీకృష్ణ,
టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

వారికి న్యాయం చేయాలి



టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టడం స్వాగతిస్తున్నాం. ఐక్య పోరాటల ద్వారా ప్రభుత్వం ఈ నిర్ణయానికి రాక తప్పలేదు. దీని వల్ల ఉన్నత పాఠశాలల్లో కొంతమేర ఉపాధ్యాయుల కొరత తీరనుంది. అన్ని జిల్లాల్లో నిబంధనల మేరకు ఒకే విధంగా సినియారిటీ జాబితా తయారు చేయాలి. జీఓ 317కారణంగా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేసి, న్యాయం చేయాలి.

-చుంచు శ్రీశైలం,
టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు

108 వాహనానికి దారివ్వరా..?



మెయిన్ రోడ్డులో నిలిచిన 108 వాహనం

దోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీలోని పలు వీధుల్లో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెయిన్ రోడ్డులో వ్యాపారులు తమ దుకాణాల ముందు రోడ్లను ఆక్రమించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దుకాణాలకు సరుకులను రవాణా చేసే లారీలను రోడ్లపై గంటల తరబడి నిలుపుతుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. గురువారం మండలంలోని గొల్లచర్ల శివారు తండా నుంచి అత్యవసర వైద్యసేవల సమాచారం రావడంతో రైల్వేస్టేషన్ సమీపం నుంచి బయలుదేరిన 108వాహనానికి మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి. దుకాణాల్లో సరుకులు రవాణా చేస్తున్న లారీ రోడ్డుపై నిలవడం, మరో కారును పార్కింగ్ చేయడంతో 108 వాహనం సుమారు 20 నిమిషాల పాటు మెయిన్ రోడ్డుపై నిలిచింది. 108 వాహనం అత్యవస సేవలకు వెళ్తూ సైరన్ వేసినా లారీతో పాటు కారు యజమాని పట్టించుకోలేదు. 108వాహనానికి దారి ఇవ్వని వ్యాపారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

కామాంధుడి అరెస్ట్

గార్ల: మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం కొత్తతండాలో రెండేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం చేసిన సపావట్ అశోక్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బుధవారం చిన్నారిని ఊయలలో పడుకోబెట్టి తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా అదే తండాకు చెందిన అశోక్ చిన్నారిపై అత్యాచారయత్నం చేయబోయిన విషయం తెలిసిందే. దీంతో చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిన పోలీసులు అశోక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సూచిక బోర్డును ఢీకొట్టిన బైక్

- ఒకరికి తీవ్రగాయాలు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం – కమలాపురం గ్రామాల మధ్య రోడ్డు పక్కనే ఉన్న సూచిక బోర్డును ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఏటూరునాగారం గ్రామ పంచాయతీ నర్సరీ వద్ద గురువారం ఈ సంఘటన చోటు చేసుకుంది. కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లి గ్రామానికి చెందిన ఎన్నంపెల్లి రాంబాబు బయ్యారంలో వివాహానికి హాజరై తిరిగి ముప్పనపల్లికి వెళ్తున్నాడు. ఏటూరునాగారం నర్సరీ వద్ద బైక్ అదుపుతప్పి సూచిక బోర్డును ఢీకొట్టింది. దీంతో రాంబాబు కుడికాలు విరిగింది. 108 వాహనంలో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణం

మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామానికి చెందిన మేకల రవి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన మేకల రవి కొంతకాలంగా భార్యతో తరుచు గొడవ పడేవాడు. నెల రోజుల క్రితం అతడి భార్య పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో వారం క్రితం అత్తగారింటికి వెళ్తానని బంధువుల వద్ద డబ్బు తీసుకొని గ్రామంలో కనిపించడం లేదు. అతడి ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు తలుపులు తీసి చూడగా ఉరేసుకుని కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి అక్క అర్కా రజిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

మిర్చి రైతు వద్ద నగదు చోరీ

రామన్నపేట : మిర్చి ఏనుమాముల మార్కెట్‌లో విక్రయించి ఇంటికి వెళ్లే క్రమంలో వరంగల్ బస్టాండ్‌లో రైతు వద్ద రూ.45 వేల నగదు చోరీకి గురైన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చిన్నకొరుపోలుకు చెందిన మాతంగి ముత్తయ్య బుధవారం ఏనుమాముల మార్కెట్‌లో మిర్చి విక్రయించగా రూ.45 వేలు వచ్చాయి. ఇంటికి వెళ్లేందుకు మధ్యాహ్నం వరంగల్ బస్టాండ్‌కు వచ్చి మహబూబాబాద్‌కు వెళ్లే బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తి నగదు కాజేశాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపి అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తెలిపారు.

ఉత్తములకు 'ప్రశంస'లు


అధికారికి ప్రశంసపత్రం అందజేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్

గణతంత్ర దినోత్సవం సందర్భంగా విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలుశాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి నూతన కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, ట్రైనీ కలెక్టర్ పింకేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు గురువారం ప్రశంసపత్రాలు అందజేశారు.

– సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్








సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థినులు




స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య పనులు

- మేడారం మినీజాతర విధుల్లో 300 మంది కార్మికులు, 150 మంది సిబ్బంది
- 'సాక్షి'తో ములుగు పంచాయతీ అధికారి వెంకయ్య

ఎస్‌ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మ మినీ జాతరలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నట్లు ములుగు డీపీఓ వెంకయ్య తెలిపారు. గురువారం మేడారంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన అనంతరం ఆయన సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు జరిగే మినీ జాతర (మండమెలిగె) ఉత్సవాలకు లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారనే అంచనాతో ప్రణాళికాబద్ధంగా పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జాతర అనంతరం పోస్ట్ జాతరలో కూడా భక్తులకు, స్థానిక ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పారిశుద్ధ్య పనులు చేపడుతామని పేర్కొన్నారు. మినీ జాతర నేపథ్యంలో ఇప్పటి నుంచే ముందస్తుగా భక్తులు వస్తుండడంతో పది రోజుల క్రితం నుంచే పనులను ప్రారంభించామని వెల్లడించారు.

జాతరకు 300మంది కార్మికులు..

మినీజాతరలో పారిశుద్ధ్య పనుల కోసం 300మంది కార్మికులను ఏర్పాటు చేస్తున్నట్లు డీపీఓ వెంకయ్య తెలిపారు. జంపన్నవాగు, చిలుకలగుట్ట, ఆర్టీసీ బస్టాండ్ వై జంక్షన్, ఊరట్టం స్తూపం, రెడ్డిగూడెం, మేడారం గ్రామంతో పాటు భక్తులు విడిది చేసే ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జాతరను సెక్టార్ వారీగా విభజించి ఏయే ప్రాంతాల్లో ఎంత మంది కార్మికులను ఏర్పాటు చేయాలనేది పంచాయతీ అధికారులు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. జాతర నిర్వహణకు 150 మంది సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. షిఫ్ట్‌ల వారీగా కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేపట్టి ఎక్కడా కూడా చెత్తా చెదారం లేకుండా డంపింగ్ యార్డ్‌కు తరలిస్తామన్నారు. బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.


మరుగుదొడ్ల మరమ్మతులను పరిశీలిస్తున్న డీపీఓ వెంకయ్య


రోడ్డును శుభ్రం చేస్తున్న కార్మికులు

షెడ్ల వద్ద ఏర్పాట్లు...

మేడారంలోని ఐదు షెడ్ల వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేపడుతున్నట్లు డీపీఓ తెలిపారు. షెడ్ల వద్ద మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావడంతో పాటు వాటికి వాటర్ కనెక్షన్ల మరమ్మతులు చేస్తున్నామన్నారు. మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంకులను కూడా శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. షెడ్లలో ఫ్యాన్లు, లైటింగ్ సిస్టం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు కూడా ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వస్తువులు, చెత్తచెదారం పడేయకుండా సహకరించాలని కోరారు. జిల్లా అధికారుల సూచనలు, సలహాల మేరకు పారిశుద్ధ్య సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

మోకుజారి గీత కార్మికుడి మృతి

చిల్పూరు: మోకు జారి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన జనగామ జిల్లా చిల్పూరు మండలం మల్కాపూర్ పరిధి కొమ్ముగుట్టలో గురువారం జరిగింది. ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ తెలిసిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు కుమారస్వామి(55) కొన్నేళ్ల క్రితం కుటుంబ పోషణ నిమిత్తం మల్కాపూర్ పరిధి కొమ్ముగుట్టకు చేరుకున్నాడు. గీత వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం మధ్యాహ్నం కల్లు గీసేందుకు తాటి వనానికి వెళ్లాడు. తాటి చెట్టు ఎక్కి ఒక గెల గీసి మరో గెల వైపు తిరుగుతుండగా మోకు జారింది. దీంతో పైనుంచి కిందివరకు జారడంతో తీవ్రగాయాలై చెట్టుపైనే మృతి చెందాడు. కుటుంబాన్ని పోషించే తాటి చెట్టే ఊపిరి తీసేఅంటూ మృతుడి భార్య పుష్పలీల రోదించిన తీరు కంటతడి పెట్టించింది. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సర్పంచ్‌లు ఏదునూరి రవీందర్, కొంగరి రవి, ఉప సర్పంచ్‌లు కంకటి రాజన్న, బబ్బుల వంశీ, బీఆర్‌ఎస్ నాయకుడు పోలేపల్లి రంజిత్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



మోకుజారి మృతి చెందిన కుమారస్వామి


కుమారస్వామి (ఫైల్)

పైన చెరుకు.. లోపల బెల్లం

- లారీ సీజ్.. కేసు నమోదు

దంతాలపల్లి: పైన చెరుకు లోపల నల్లబెల్లంతో వెళ్తున్న లారీని సీజ్ చేసినట్లు దంతాలపల్లి ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. దంతాలపల్లి నుంచి సూర్యాపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో కానిస్టేబుళ్లు గణేష్, బగ్గు, వెంకటేశ్వర్లు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పోలీసులను చూసి లారీ డ్రైవర్ వాహనాన్ని పక్కకు నిలిపాడు. లారీలోని మరో వ్యక్తి పారిపోయాడు. దీంతో కానిస్టేబుళ్లు లారీలో తనిఖీ చేయగా పైన చెరుకు లోన 30 బస్తాల నల్లబెల్లం కనిపించింది. దీంతో డ్రైవర్ దుంప వెంకన్న, పారిపోయిన వ్యక్తి ధారావత్ గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


లారీలో తనిఖీ చేస్తున్న పోలీసులు

చెరువులో పడి ఒకరి మృతి

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి న్యూశాయంపేట చెరువులో ప్రమాదవశాత్తు పడిపోయి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. న్యూశాయంపేటకు చెందిన అదే ఉమేష్ ఈనెల 24న ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశత్తు న్యూశాయంపేట చెరువులో పడి మృతి చెందాడు. గురువారం ఉమేష్ మృతదేహం చెరువులో తేలడంతో బయటకు తీశారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సట్టా స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్ చమన్‌లోని ఓ ఇంట్లో గురువారం సాయంత్రం సట్టా స్థావరంపై దాడి చేసి నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఉర్సు కరీమాబాద్‌లోని అంకం శ్రీకాంత్ అనే వ్యక్తి తన ఇంట్లో సట్టా నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు వరంగల్ టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ ఆదేశాలు, ఏసీపీ జితేందర్‌రెడ్డి సూచనల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి శ్రీకాంత్ నుంచి రూ.3,520ల నగదు, సెల్‌ఫోను, ప్లేకార్డులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుడు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై వడ్డె బోయిన లవణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తాటివనంలో పేకాట

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సిద్దాపురంలోని తాటివనం పేకాటరాయుళ్లకు అడ్డాగా మారింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రియల్టర్‌తోపాటు ఆటో డ్రైవర్లు వేర్వేరుగా పేకాట ఆడుతున్నారు. ఈమేరకు టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు గురువారం దాడులు చేయగా ఆటో డ్రైవర్లు చిక్కగా, రియల్టర్లతో పాటు కొంతమంది ప్రజాప్రతినిధులు పరారైనట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే పట్టుబడిన వారు ఆటో డ్రైవర్లుగా పోలీసులు చెబుతున్నారు. వారి వద్ద నుంచి రూ.8,090 నగదు స్వాధీనం చేసుకున్నారు. రెండు ఆటోలతో పాటు మరో రెండు బైక్‌లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

కేసీఆర్ సేవలు దేశానికి అవసరం


తొర్రూరులో జెండా వందనం చేస్తున్న మంత్రి దయాకర్‌రావు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా అమలు కావాలంటే కేసీఆర్ సేవలు దేశానికి అవసరమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 100 అడుగుల జాతీయ పతాక ప్రతిష్ఠాపన కమిటీ చైర్మన్ డాక్టర్ పొనుగోటి సోమేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండా ఎగరవేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యాంగబద్ధంగానే పాలన సాగుతుందన్నారు. దేశాన్ని ముందుకు నడిపించే రాజనీతి గల నాయకుడు కేసీఆర్ అని, ఆయన నాయకత్వం దేశానికి అవసరమని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, ఆసరా పింఛన్, కల్యాణలక్ష్మి, దళితబంధు తదితర పథకాలు విజయవంతంగా అమలవుతుండటంతో దేశ ప్రజల దృష్టి తెలంగాణ వైపు మళ్లిందన్నారు. సీఎం కేసీఆర్ చొరవతో తొర్రూరు మున్సిపాలిటీకి రూ.25 కోట్లు, ఒక్కో గ్రామానికి రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, గ్రామీణాభివృద్ధి కమిషన్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, జాతీయ పతాక ప్రతిష్ఠాపన కమిటీ ప్రతినిధులు శామకూరి ఐలయ్య, ధరావత్ జైసింగ్, చీకటి శ్రీనివాస్, దొంగరి శంకర్, కుర్ర శ్రీనివాస్, జీలుకర సురేందర్, ఆర్డీఓ రమేష్, డీఎస్పీ రఘు, తహసీల్దార్ నాగేంద్రప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పసుమర్తి శాంత, వైస్ సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, పట్టణ అధ్యక్షుడు రామిని శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

గవర్నర్ వ్యవస్థను కించపరిచే విధంగా పనిచేస్తున్న తమిళిసై

పర్వతగిరి: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ భారత రాజ్యాంగ వ్యవస్థను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో పర్వతాల శివాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలచే ఎన్నుకోబడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కించపరిస్తే రాష్ట్ర ప్రజలను కించపరిచినట్లే అవుతుందన్నారు. తెలంగాణ గవర్నర్ కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి ఏజెంట్‌గా పని చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా గవర్నర్ సమాలోచన చేసి గౌరవాన్ని కాపాడుకునే విధంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.

ఏటీఎం కార్డులు మార్చి నగదు డ్రా

- నిందితుడి అరెస్ట్

మహబూబాబాద్ రూరల్ : ఏటీఎం సెంటర్లలో డబ్బు డ్రా చేసుకునేందుకు వచ్చిన వారికి మాయ మాటలు చెప్పి ఏటీఎం కార్డులు మార్చి నగదు విత్‌డ్రా చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ టౌన్ ఎస్సై విజయరాంకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం వివరాలు వెల్లడించారు. విజయవాడలోని భవానీపురం ప్రాంతానికి చెందిన అలవుల వెంకటనాగసుధాకర్ జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో ఏటీఎం సెంటర్లకు వచ్చేవారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కార్డులు మార్చి నగదు డ్రా చేసుకునేవాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గుమ్ముడూరు ఎస్‌బీఐ బ్యాంకు పక్కన గల ఏటీఎం సెంటర్‌లో డిసెంబర్ 13న కార్డు మార్చి డబ్బు డ్రా చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. సమావేశంలో పీసీలు రుద్రయ్య, బాలరాజు, జావిద్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై విజయరాంకుమార్

పశువైద్యశాఖ ఏడీ ఆత్మహత్య

- నిజామాబాద్‌లో ఘటన
- పోలీసులకు లభ్యమైన సూసైడ్‌నోట్

హన్మకొండ/ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగర పరిధిలోగల సారంగపూర్ డెయిరీఫాంలోని డిస్ట్రిక్ లైవ్ స్టాక్ డైయిరీ డెవలప్‌మెంట్ శాఖ కార్యాలయంలో బుధవారం రాత్రి నిజామాబాద్ వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ పెద్దకాసుల శ్రీశైలం(52) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండకు చెందిన శ్రీశైలం గత ఏడాది వరంగల్ నుంచి నిజామాబాద్‌కు ఏడీగా బదిలీపై వెళ్లారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఆయన హనుమకొండలోని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి అందరు మంచిగా ఉండాలని తెలిపారు. తండ్రి మాటల్లో తేడాలు రావడంతో కుమారుడు రవితేజ వెంటనే నిజామాబాద్ వెళ్లాడు. శ్రీశైలం గదికి గడియ ఉండటంతో తలుపులు తొలిగించి తెరిచేసరికి ఆయన ఉరివేసుకొని ఉన్నారు. ఏడీ చనిపోయే ముందు సూసైడ్‌నోట్ రాశాడు. అందులో తన చావుకు ఎవరు కారణం కాదని ఉంది. కానీ సూసైడ్ నోట్‌ను గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అతడు కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడారా? లేదా ఆర్థిక కారణాలు, ఇతరత్రా కారణాలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని హనుమకొండకు తరలించారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఏడాది క్రితం కుమార్తె వివాహం, డిసెంబర్ 4న పెద్ద కుమారుడి వివాహం జరిపించారు.


శ్రీశైలం (ఫైల్)

తొర్రూరులో విషాదఛాయలు

తొర్రూరు వాసి అయిన పెద్దకాసుల శ్రీశైలం ఆత్మహత్యతో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తొర్రూరులో పాఠశాల, ఇంటర్ విద్య పూర్తిచేసిన ఆయన అనంతరం వెటర్నరీ విద్యను అభ్యసించి పశుగణాభివృద్ధి శాఖలో ఏడీ స్థాయికి ఎదిగారు. తొర్రూరుకు ఎప్పుడు వచ్చినా అందరితో కలగలపుగా ఉండేవాడని స్థానికులు పేర్కొన్నారు. ఆయన అకాల మరణంతో స్నేహితులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు.